సాక్షి సూర్యాపేట

ఆదివారం । 19 । మే । 2024

గరిష్టం / కనిష్టం
32° / 26°

వాతావరణం
ఆకాశం మేఘావృతమై ఉంటుంది. ఉరుములతో కూడిన వర్షం కురిసే అవకాశం ఉంది.

సాక్షి మైత్రి మహిళ ఆధ్వర్యంలో బ్యూటీషియన్ కోర్సులో శిక్షణ

- శిక్షణలో పాల్గొన్న వారికి సర్టిఫికెట్ల అందజేత

సాక్షి మైత్రి మహిళ

సాక్షి మైత్రి మహిళ ఆధ్వర్యంలో ఈ నెల 23 నుంచి జూన్ 22 వ తేదీ వరకు బ్యూటీషియన్ కోర్సులో శిక్షణ ఇవ్వనున్నారు. ఆదివారం మినహా మిగిలిన రోజుల్లో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు శిక్షణ ఇస్తారు

శిక్షణలో నేర్పించే అంశాలు
త్రెడ్డింగ్, వ్యాక్స్, పెడిక్యూర్, మెనిక్యూర్, బ్లీచింగ్, స్కిన్‌కేర్, హెయిర్ కేర్, వైట్నింగ్ ఫేస్ ప్యాక్స్, డ్యాండ్రఫ్ ట్రీట్‌మెంట్, హెయిర్ ఫాల్ ట్రీట్‌మెంట్, హెయిర్ కట్స్, హెయిర్ స్టైల్స్, హెన్నా ప్రిపరేషన్, డై అప్లికేషన్, మేకప్స్ (బ్రైడల్, పార్టీ, లైట్ మేకప్స్),హెయిర్ మసాజ్, కమ్యూనికేషన్ అండ్ గ్రూమింగ్, ఫేషియల్స్

రిజిస్ట్రేషన్ స్వీకరించు తేదీలు :
ఈ నెల 22వ తేదీ వరకు ఉదయం 10 నుంచి సాయంత్రం 6 గంటల వరకు.
ఫీజు : రూ.3 వేలు
వర్క్‌షాప్ షెడ్యూల్ తేదీలు: ఈ నెల 23వ తేదీ నుంచి జూన్ 22వ తేదీ వరకు ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1గంట వరకు శిక్షణ ఉంటుంది.

రిజిస్ట్రేషన్స్, శిక్షణ స్థలం
సాహితీ బ్యూటీ పార్లర్ అండ్ ట్రైనింగ్ సెంటర్,
ఏకలవ్య స్కూల్ రోడ్,
శివాజీ నగర్, నల్లగొండ
సెల్: 96660 13544, 80747 42864

న్యూస్‌రీల్

జూన్ 8న జాతీయ మెగా లోక్‌అదాలత్



మాట్లాడుతున్న జిల్లా జడ్జి గోవర్ధన్‌రెడ్డి

చివ్వెంల(సూర్యాపేట): సూర్యాపేట జిల్లా కోర్టు ప్రాంగణంలో జూన్ 8న నిర్వహించే జాతీయ మెగా లోక్ అదాలత్‌ను విజయవంతం చేయాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎస్.గోవర్ధన్‌రెడ్డి అన్నారు. శనివారం జిల్లా కోర్టు ప్రాంగణంలో పోలీస్ అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. లోక్ అదాలత్ నిర్వహణపై ప్రజలకు, కక్షిదారులకు అవగాహన కల్పించాలని సూచించారు. సంవత్సరాల తరబడి కోర్టుల చుట్టూ తిరుగకుండా లోక్ అదాలత్ ద్వారా కేసులను పరిష్కరించుకోవాలని, దీనివల్ల ఇరువర్గాల వారు గెలిచిన వారు కావడంతోపాటు కాలం, ధనం వృథా కాకుండా ఉంటుందన్నారు. సివిల్, క్రిమినల్, బ్యాంకు, ఎక్సైజ్, వెహికల్ యాక్టు వంటి కేసులను రాజీ ద్వారా పరిష్కరించుకోవచ్చన్నారు. ఈ సమావేశంలో జిల్లా మొదటి అదనపు న్యాయమూర్తి శ్యామ్‌శ్రీ, సీనియర్ సివిల్ జడ్జి పి.శ్రీవాణి, జూనియర్ సివిల్ జడ్జి కె.సురేష్, ఏఎస్పీ నాగేశ్వర్‌రావు, వివిధ మండలాల ఎస్‌ఐలు, కోర్టు కానిస్టేబుళ్లు, సిబ్బంది పాల్గొన్నారు.

ఆలేరుకు నేడు కేటీఆర్ రాక

యాదగిరిగుట్ట: మాజీ మంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆదివారం ఆలేరుకు రానున్నట్లు ఆలేరు మాజీ ఎమ్మెల్యే గొంగిడి సునీత శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక ఇమ్మడి నర్సింహారెడ్డి గార్డెన్స్‌లో నిర్వహించనున్న నల్లగొండ-ఖమ్మం-వరంగల్ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల సన్నాహక సమావేశానికి ఆయన హాజరుకానున్నారని పేర్కొన్నారు. కేటీఆర్‌తో పాటు మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీష్‌రెడ్డి రానున్నారని తెలిపారు.

ఆదాయానికి గండి

మామిడి మార్కెట్‌లో వ్యాపారుల మాయాజాలం
- అధికారులతో కుమ్మక్కై తక్కువ ఫీజు చెల్లింపు
- ఏటా రూ.కోట్లలో వ్యాపారం
- రూ.అరకోటి దాటని మార్కెట్ ఫీజు



సూర్యాపేట మార్కెట్‌లో అమ్మకానికి సిద్ధంగా ఉన్న మామిడి కాయలు

భానుపురి (సూర్యాపేట): సూర్యాపేట మామిడి మార్కెట్‌లో వ్యాపారుల మాయాజాలం కొనసాగుతోంది. అధికారులతో కుమ్మక్కై వ్యవసాయ మార్కెట్ ఆదాయానికి భారీగా గండి కొడుతున్నారు. ఏటా సుమారు రూ.150 కోట్ల నుంచి రూ.200 కోట్లకుపైగా వ్యాపారం జరుగుతుందన్న అంచనాలు ఉన్నప్పటికీ దాదాపుగా రూ.కోటిన్నరకు పైగా ఆదాయాన్ని కోల్పోతుందన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. నిబంధనల ప్రకారం వ్యాపారులు నిర్వహించిన కొనుగోళ్లలో మార్కెట్ కమిటీకి ఒక్క శాతం ఫీజు రూపేనా చెల్లించాల్సి ఉంటుంది. కొన్నేళ్లుగా రూ.కోట్లలో వ్యాపారం నిర్వహిస్తున్నప్పటికీ మార్కెట్ ఫీజు రూపేనా ఏటా రూ.15లక్షల నుంచి రూ.25 లక్షల లోపు మాత్రమే ఆదాయం సమకూరుతోంది.

వసూలైన ఫీజు వివరాలు

సీజన్	ఫీజు (రూ.లక్షల్లో..)
2022	22.51
2023	19.84
2024 (ఇప్పటి వరకు)	3.39

నిత్యం 30 లారీల్లో..
సూర్యాపేటలో ప్రత్యేకంగా మామిడికి మార్కెట్ లేకున్నా.. జనగామ క్రాస్‌రోడ్డు సమీపంలో 17 మంది లైసెన్స్‌డ్ వ్యాపారుల తోపాటు మరో ముగ్గురు అనధికారికంగా షెడ్లలో వ్యాపారాన్ని సాగిస్తున్నారు. ఇక్కడి నుంచి ఢిల్లీ, జమ్ముకశ్మీర్, చండీగఢ్, హరియానా, పంజాబ్, నాగ్‌పూర్ తదితర రాష్ట్రాలకు రోజూ 20 నుంచి 30 లారీల్లో మామిడి కాయలను ఎగుమతి చేస్తారు. ప్రస్తుతం టన్నుకు రూ.30వేల వరకు ధర ఉండగా ఒక్కో లారీలో తరలించే 15 టన్నులకు రూ.4.50 లక్షలు విలువ ఉంటుంది. వ్యాపారులు మార్కెట్ ఫీజు నిమిత్తం ఒక్కశాతం ఫీజు చెల్లిస్తే ఒక్కో లారీకి రూ.4,500లను అవుతోంది. ఈ లెక్కన ప్రతిరోజూ సగటున మార్కెట్‌కు రూ.90వేల నుంచి రూ.1.35లక్షల వరకు ఫీజు రావాల్సి ఉంది. దాదాపుగా మూడు నెలలు కొనసాగే మార్కెట్‌తో రూ.కోటిన్నర వరకు ఆదాయం వచ్చే అవకాశముంది.

ఫీజు చెల్లింపు అంతంతే..!
మామిడికాయ ధర పెరిగిన సందర్భంలో దాని ప్రకారం ఫీజు చెల్లించాల్సి ఉంటుంది. అయితే వ్యాపారులు అధిక రేటుకు మామిడికాయలు కొనుగోలు చేసినా తక్కువ రేటుకు కొనుగోలు చేశామని గోల్‌మాల్ చేస్తూ ఆ మేరకు అధికారులకు మార్కెట్ ఫీజు చెల్లిస్తున్నారు. ఈ క్రమంలో అధికారులతో కుమ్మక్కు అవుతున్నారనే ఆరోపణలు ఉన్నాయి. ఉన్నతాధికారులు పట్టించుకోవడం లేదనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఇప్పటికైనా అధికారులు పకడ్బందీ చర్యలు తీసుకుని ఆదాయానికి గండి పడకుండా చూడాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.



మట్టపల్లిలో అధ్యయనోత్సవాలు ప్రారంభం



ఆలయంలో పూజలు చేస్తున్న అర్చకులు

మఠంపల్లి: మట్టపల్లి శ్రీలక్ష్మీనరసింహస్వామి క్షేత్రంలో తిరుకల్యాణ బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం రాత్రి అధ్యయనోత్సవాలు ప్రారంభమయ్యాయి. తొలిరోజు ప్రారంభ (తౌలక్కం) ప్రత్యేక పూజలు జరిపారు. అనంతరం మహా నివేదనతో భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. ఆదివారం అధ్యయనోత్సవం, సోమవారం పరమపదోత్సవం, మంగళవారం శాత్తుమరై పూజలు జరుగుతాయని అర్చకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ అనువంశిక ధర్మకర్తలు చెన్నూరు మట్టపల్లిరావు, విజయ్‌కుమార్, ఈఓ నవీన్‌కుమార్, అర్చకులు కృష్ణమాచార్యులు, పద్మనాభాచార్యులు, బదరీనారాయణాచార్యులు, బ్రహ్మాచార్యులు, ఆంజనేయాచార్యులు, అనంతాచార్యులు, నర్సింహాచార్యులు పాల్గొన్నారు.

గ్రూప్–1 ప్రిలిమ్స్‌కు 32 కేంద్రాలు

- కలెక్టర్ వెంకటరావు

సూర్యాపేట: జూన్ 9న నిర్వహించే గ్రూప్–1 ప్రిలిమ్స్ పరీక్షకు జిల్లాలో 32 కేంద్రాలను ఏర్పాటు చేశామని కలెక్టర్ ఎస్.వెంకటరావు తెలిపారు. తెలంగాణ రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ చైర్మన్ మహేందర్‌రెడ్డి శనివారం హైదరాబాద్ నుంచి అన్ని జిల్లాల కలెక్టర్లు, ఎస్పీలు, రీజినల్ కోఆర్డినేటర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి పలు సూచనలు చేశారు. ఈ కాన్ఫరెన్స్‌కు ఏఎస్పీ నాగేశ్వరరావుతో కలిసి కలెక్టర్ హాజరై మాట్లాడారు. 32 కేంద్రాల్లో 9,725 మంది అభ్యర్థులు పరీక్ష రాయనున్నారని తెలిపారు. కార్యక్రమంలో పరీక్షల సూపరింటెండెంట్ పద్మారావు తదితరులు పాల్గొన్నారు.



కాన్ఫరెన్స్‌కు హాజరైన కలెక్టర్ వెంకటరావు తదితరులు

ప్లాస్టిక్ రహిత సమాజమే లక్ష్యం
ప్లాస్టిక్ రహిత సమాజమే మన ముందున్న లక్ష్యమని కలెక్టర్ వెంకటరావు అన్నారు. శనివారం అదనపు కలెక్టర్లు సీహెచ్.ప్రియాంక, బీఎస్.లతతో కలిసి జిల్లాస్థాయి అధికారులు, ఉద్యోగులతో నిర్వహించిన వెబెక్స్‌లో మాట్లాడారు. ప్లాస్టిక్ నిషేధం అమలుకు జిల్లాస్థాయిలో అదనపు కలెక్టర్ ప్రియాంక నోడల్ అధికారిగా, కలెక్టరేట్‌కు నోడల్ అధికారిగా అదనపు కలెక్టర్ లత వ్యవహరిస్తారని తెలిపారు. కలెక్టరేట్, ఆర్డీఓ, ఎంపీడీఓ, తహసీల్దార్ల కార్యాలయాలతోపాటు, పాఠశాలలు, వసతి గృహాలు, హాస్పిటళ్లలో మూడు విడతలుగా ప్లాస్టిక్ నిషేధం అమలు చేయాలన్నారు. వచ్చే మంగళవారం నుంచి కలెక్టరేట్‌లో వాటర్ బాటిల్స్, ప్లాస్టిక్ సంచులు నిషేధించాలని, లేకుంటే సంబంధిత కార్యాలయానికి జరిమానా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్పీ సీఈఓ అప్పారావు, డీఆర్‌డీఓ మధుసూదన్‌రాజు, కలెక్టరేట్ ఏఓ సుదర్శన్‌రెడ్డి పాల్గొన్నారు.

'పట్టభద్రుల' పోలింగ్‌లో మధ్యవేలికి సిరా

భానుపురి (సూర్యాపేట): రాష్ట్రంలో ఈనెల 13న జరిగిన లోక్‌సభ ఎన్నికల పోలింగ్‌లో ఓటర్లకు ఎడమ చేతి చూపుడు వేలుపై ఇన్‌డికేబుల్ ఇంక్ పెట్టిన నేపథ్యంలో 27న జరిగే పట్టభద్రుల ఎమ్మెల్సీ ఉప ఎన్నికల్లో ఓటువేసే వారికి మధ్యవేలికి సిరా గుర్తు పెట్టాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఎస్.వెంకటరావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు హక్కును వినియోగించుకునే వారు లోక్‌సభ ఎన్నికల్లో ఓటువేసి ఉన్నట్లయితే ఈ నిబంధన పాటించాలని పేర్కొన్నారు. ప్రొసీడింగ్ అధికారి, పోలింగ్ అధికారి ఎమ్మెల్సీ ఉప ఎన్నిక సమయంలో ఓటరు ఎడమ చూపుడు వేలుని పరిశీలించి ఇంకును పెట్టాలని కోరారు.

ర్యాలీలు, సభలకు అనుమతి తప్పనిసరి

- ఎస్పీ రాహుల్ హెగ్డే

సూర్యాపేట టౌన్: వరంగల్–ఖమ్మం–నల్లగొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఉప ఎన్నిక బరిలో ఉన్న అభ్యర్థులు ఎన్నికల ప్రవర్తనా నియమావళిని పాటించడంలో భాగంగా నిర్వహించే ర్యాలీలు, సభలు, సమావేశాలకు తప్పనిసరిగా సంబంధిత అధికారుల అనుమతి తీసుకోవాలని జిల్లా ఎస్పీ రాహుల్ హెగ్డే శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. అభ్యర్థులు తమ ప్రసంగాల్లో రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేయవద్దని, ఓటర్లను ఎలాంటి ప్రలోభాలకు గురి చేయవద్దని పేర్కొన్నారు. అనుమతి లేకుండా ఇళ్ల గోడలపై రాతలు రాయటం, హోర్డింగులు ఏర్పాటు చేయొద్దని, సోషల్ మీడియాలో ఇతరులను కించపరిచే విధంగా పోస్టులు పెట్టవద్దని తెలిపారు. ఎన్నికలకు సంబంధించి సీ–విజిల్ యాప్ ద్వారా ఫిర్యాదులు చేయవచ్చని సూచించారు.

24న పాలిసెట్

సూర్యాపేట టౌన్: ఈనెల 24న పాలిటెక్నిక్ కళాశాల డిప్లమా కోర్సుల్లో ప్రవేశానికి ఎంట్రెన్స్ పరీక్ష (పాలిసెట్-2024) నిర్వహిస్తున్నట్లు సూర్యాపేట ప్రభుత్వ మహిళా పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్, పాలిసెట్ జిల్లా కోఆర్డినేటర్ సీహెచ్.నర్సింహారావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా కేంద్రంలో 5 సెంటర్లు ఏర్పాటు చేశామని, ఇందులో 2,362 మంది విద్యార్థులు పరీక్ష రాయనున్నట్లు పేర్కొన్నారు. రూ.300 ఆలస్య రుసుంతో ఈ నెల 20వ తేదీ వరకు దరఖాస్తు చేసుకునే అవకాశం ఉందని పేర్కొన్నారు. ఈ ఏడాది పదో తరగతి పాసైన విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

క్లుప్తంగా

చికిత్స పొందుతూ వృద్ధుడు మృతి

కొండమల్లేపల్లి: రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన వృద్ధుడు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ శనివారం మృతి చెందాడు. ఎస్‌ఐ రామ్మూర్తి తెలిపిన ప్రకారం వివరాల ప్రకారం.. నాగర్‌కర్నూల్ జిల్లా తెలకపల్లికి చెందిన సంకెళ్ల నారాయణ(65) కొండమల్లేపల్లి మండలంలోని చిన్నఅడిశర్లపల్లి గేటు వద్ద ఈ నెల 16వ తేదీ రాత్రి సమయంలో రోడ్డు దాటుతుండగా కారు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన నారాయణను హైదరాబాద్‌లోని గాంధీ ఆస్పత్రికి తరలించగా.. చికిత్స పొందుతూ శనివారం మృతి చెందాడు. మృతుడి కుమారుడు బీరయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

పురుగుల మందు తాగిన యువకుడు..

సూర్యాపేట టౌన్: అప్పులు, ఆర్థిక ఇబ్బందులతో పురుగుల మందు తాగిన యువకుడు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ శనివారం మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సూర్యాపేట జిల్లా కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం సమీపంలో నివాసముంటున్న వందనపు వెంకన్న కుమారుడు యశ్వంత్(27) అప్పులు, ఆర్థిక ఇబ్బందులతో ఈ నెల 12న పురుగుల మందు తాగాడు. అతడిని హైదరాబాద్‌లోని నిమ్స్ ఆస్పత్రిలో చేర్పించగా చికిత్స పొందుతూ శనివారం మృతిచెందాడు. మృతుడి తండ్రి వెంకన్న ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పట్టణ సీఐ రాజశేఖర్ తెలిపారు.

కలప తరలిస్తున్న లారీ బోల్తా

- డ్రైవర్, ముగ్గురు కూలీలకు గాయాలు



బోల్తా పడిన లారీ

వలిగొండ: కలప తరలిస్తున్న లారీ బోల్తాపడడంతో డ్రైవర్, ముగ్గురు కూలీలు తీవ్రంగా గాయపడ్డారు. ఈ ఘటన వలిగొండ మండలంలోని గోకారం సమీపంలో శనివారం సాయంత్రం జరిగింది. 108 సిబ్బంది తెలిపిన వివరాల ప్రకారం.. కలప లోడుతో వెళ్తున్న లారీ అదుపు తప్పి గోకారం గ్రామ సమీపంలో బోల్తా పడింది. ఈ ప్రమాదంలో లారీ డ్రైవర్ వెంకటేష్‌తో పాటు కూలీలు భరత్, రాధిక, మరొకరు తీవ్రంగా గాయపడ్డారు. స్థానికుల సమాచారం మేరకు ఘటనా స్థలానికి చేరుకున్న 108 వాహనం పైలెట్ సురేష్, ఈఎంటీ సాలయ్య గాయపడిన క్షతగాత్రులను చికిత్స నిమిత్తం 108 వాహనంలో చౌటుప్పల్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

పర్యావరణ పరిరక్షణకు పచ్చని ఆలోచన

- స్కూల్‌లో ఉన్నప్పటి నుంచి సీడ్ బాల్స్ తయారు చేస్తున్న స్నేహితులు
- ఉన్నత చదువుల నిమిత్తం వేరైనా కొనసాగుతున్న మహాయజ్ఞం



సీడ్ బాల్స్ తయారు చేస్తున్న దీక్షిత, చిన్నారులు

రామగిరి(నల్లగొండ): పర్యావరణ పరిరక్షణకు ప్రభుత్వాలు, ఎన్‌జీఓలు, పారిశ్రామికవేత్తలు అనేక కార్యక్రమాలు చేపడుతున్నారు. వారి ఆలోచనలకు అనుగుణంగా నల్లగొండ పట్టణానికి చెందిన చల్లోజు దీక్షిత తన సోదరుడు, ఇద్దరు మిత్రులతో కలిసి చెట్లను పెంచే కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. నల్ల గొండ మున్సిపాలిటీ పరిధిలోని కేంద్రీయ విద్యాలయంలో 2019లో 9వ తరగతి చదువుతున్న సమయంలో తన స్నేహితురాళ్లు కత్తుల సిరిచందన, దేశపాక ప్రణతి, తమ్ముడు జశ్వంత్‌తో కలిసి చెట్లను పెంచాలనే బాధ్యతను దీక్షిత భుజానికెత్తుకుంది. ఒక రోజు పాఠశాలలో జరిగిన సేవ్ ఎన్విరాన్‌మెంట్–సేవ్ లైఫ్ అనే కార్యక్రమంతో మొక్కలు పెంచాలనే ఆలోచన వీరి మనసులో బలంగా నాటుకుంది. దీని కోసం సీడ్ బాల్స్ తయారు చేయడం ప్రారంభించారు. సెలవు రోజుల్లో, వేసవి సెలవుల్లో స్వయంగా సేకరించిన విత్తనాలు, మట్టిని కలిపి వాటికి కాస్తంత పేడ జోడించి సీడ్ బాల్స్ తయారు చేయడం మొదలు పెట్టారు. వారం పది రోజుల పాటు వాటిని ఆరబెట్టి, ఆ తర్వాత సీడ్ బాల్స్‌ను గుట్టలు, కొండ ప్రాంతాల్లో, రోడ్లకు ఇరువైపులా విసిరేవారు.



గుట్టలపై సీడ్ బాల్స్ వేస్తున్న విద్యార్థులు (ఫైల్)

ప్రతి ఏటా నిర్విరామంగా..

దీక్షిత తన ఇద్దరు స్నేహితులు, తమ్ముడితో కలిసి నాంది పలికిన సీడ్ బాల్స్ కార్యక్రమం ప్రతి ఏటా నిర్విరామంగా కొనసాగుతోంది. దీక్షిత ప్రస్తుతం బీటెక్ చదువుతోంది. మిగతా ఇద్దరు స్నేహితురాళ్లు వేర్వేరు చోట్ల ఉన్నత చదువులు చదువుతున్నారు. అయినప్పటికీ తన తమ్ముడు జశ్వంత్‌తో పాటు తన ఇంటి చుట్టుపక్కల ఉన్న చిన్నారులతో కలిసి ఇప్పటికీ సీడ్‌బాల్స్ తయారుచేస్తూ నలుగురికి స్ఫూర్తిదాయకంగా నిలుస్తోంది. వీరి ప్రతిభను ఎంతోమంది ప్రముఖులు, అధికారులు, అనేక సంస్థలు గుర్తించి సన్మానించారు.

బొకేలకు బదులుగా సీడ్ బాల్స్




సంతోషకరమైన సందర్భాలను కూడా పర్యావరణ వేడుకలుగా జరుపుకోవాలన్నదే మా సంకల్పం. ఇందుకోసం పుట్టినరోజు, ఇతర వేడుకలకు స్నేహితులకు సీడ్ బాల్స్‌ను గిఫ్ట్‌గా పంచడం మొదలుపెట్టాం. పర్యావరణానికి మేలు జరుగుతుంది కాబట్టి బొకేలకు బదులుగా సీడ్ బాల్స్ గిఫ్ట్‌గా ఇవ్వాలన్నదే మా అభ్యర్థన. – చల్లోజు దీక్షిత

ఆనందంగా ఉంది



నేను 2019 సంవత్సరం నుంచి నేను ఈ కార్యక్రమంలో పాల్గొంటున్నాను. చాలా ఆనందంగా ఉంది. వేసవి సెలవుల్లో అందరం కలిసి ఇంట్లో సేకరించిన పండ్ల గింజలతో పాటు అందరూ సేకరించిన గింజలతో ఈ సీడ్ బాల్స్ తయారు చేస్తాం. ప్రతిఒక్కరూ సీడ్ బాల్స్ తయారు చేసి రోడ్లకు ఇరువైపులా, సమీపంలోని కొండ, గుట్ట ప్రాంతాల్లో వెదజల్లాలి. – సీహెచ్. చిత్రిత చార్వి



విద్యార్థులు తయారుచేసిన సీడ్ బాల్స్

పిడుగుపాటుకు గురై 15 గొర్రెలు మృతి

మిర్యాలగూడ: పిడుగుపాటుకు గురై 15గొర్రెలు మృతిచెందగా గొర్రెల కాపరికి గాయాలయ్యాయి. ఈ ఘటన మిర్యాలగూడ మండలంలోని జేత్యా తండాలో శనివారం జరిగింది. వివరాలు.. జేత్యా తండాకు చెందిన మాలోతు తావురియా తన గొర్రెలను మేపుకుంటూ తండా పరిధిలోని పరాచిగడ్డకు వచ్చాడు. ఇంతలో వర్షం రావడంతో గొర్రెలతో పాటు తను కూడా సమీపంలో ఉన్న చెట్టుకిందకు వెళ్లాడు. ఆ సమయంలో ఒక్కసారిగా పిడుగుపడడంతో 15 గొర్రెలు అక్కడికక్కడే మృతిచెందాయి. తావురియాకు గాయాలయ్యాయి. స్థానికులు గమనించి వెంటనే అతడిని మిర్యాలగూడ పట్టణంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం అతడి ఆరోగ్యం నిలకడగా ఉన్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. మృతిచెందిన గొర్రెల విలువ సుమారు రూ.1.50లక్షలు ఉంటుందని, ప్రభుత్వం తావురియాకు పరిహారం అందించి ఆదుకోవాలని తండా మాజీ సర్పంచ్ పాశం నరసింహారెడ్డి తదితరులు కోరుతున్నారు.



మిర్యాలగూడ: మృతిచెందిన గొర్రెలు

నాలుగు మేకలు..

మోతె : మండల పరిధిలో కొత్తగూడెం గ్రామ శివారులో శనివారం మధ్యాహ్నం పిడుగుపాటుకు గురై సంకోజు సత్యనారాయణచారికి చెందిన నలుగు మేకలు మృతిచెందాయి. పిడుగు పడే సమయానికి సత్యనారాయణచారి మేకలకు కొంతదూరంలో ఉండడంతో ప్రాణాలతో బయటపడ్డాడు. మృతి చెందిన మేకల విలువ సుమారు రూ.60వేలు ఉంటుందని, ప్రభుత్వం ఆర్థికంగా ఆదుకోవాలని సత్యనారాయణచారి కోరారు.

గేదె, రెండు మేకలు..

త్రిపురారం: మండలంలోని పలు గ్రామాల్లో శనివారం ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసింది. లోక్యాతండా సమీపంలోని పొలాల్లో పిడుగు పడడంతో తండా వాసి ధనావత్ కొండల్‌కు చెందిన గేదె, అలాగే రమావత్ బాలునాయక్‌కు చెందిన రెండు మేకలు మృతిచెందాయి. మృతి చెందిన గేదె విలువ రూ.50 వేలు, మేకల విలువ రూ.26వేలు ఉంటుందని, ప్రభుత్వం ఆదుకోవాలని బాధిత రైతులు కోరుతున్నారు.

749 బస్తాల పీడీఎస్ బియ్యం పట్టివేత



పెద్దవూర: పట్టుబడిన పీడీఎస్ బియ్యాన్ని పరిశీలిస్తున్న అధికారులు

పెద్దవూర: అక్రమంగా తరలిస్తున్న 749 బస్తాల పీడీఎస్ బియ్యాన్ని పోలీసులు పట్టుకున్నారు. శనివారం రాత్రి ఎస్‌ఐ పి. వీరబాబు తెలిపిన వివరాల ప్రకారం.. పెద్దవూర మండలం తెప్పలమడుగు గ్రామ సమీపంలోని అమ్మ రైస్ మిల్లులో అక్రమంగా పీడీఎస్ బియ్యం నిల్వ ఉంచినట్లు సమాచారం అందడంతో ఈ నెల 16న నల్లగొండ టాస్క్‌ఫోర్స్ విభాగం, పెద్దవూర పోలీసులు మిల్లుపై దాడి చేసి అక్కడే ఒక లారీలో ఉన్న 550 బస్తాల పీడీఎస్ బియ్యాన్ని పట్టుకొని సీజ్ చేశారు. ఈ మేరకు పెద్దవూర పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు. ఈ విచారణలో భాగంగా సివిల్ సప్లై విభాగంలో సరుకుల పంపిణీకి సంబంధించి కాంట్రాక్టర్‌గా పనిచేస్తున్న కందుల వెంకటరమణ, స్టేజ్ టు కాంట్రాక్టర్‌లుగా పనిచేస్తున్న బూరుగు శ్రీనివాస్, రమేష్, అమ్మ రైస్ మిల్లు యజమాని మలిగిరెడ్డి రామానుజరెడ్డి కలిసి నల్లగొండలోని ఎస్‌డబ్ల్యూసీ గోదాం నుంచి మండలాల్లోని ఎంఎల్‌ఎస్ పాయింట్‌లకు తరలించాల్సిన పీడీఎస్ బియ్యాన్ని లారీల్లో లోడ్ చేసి అమ్మ రైస్ మిల్లుకు తరలిస్తున్నట్లు తేలింది. అక్కడ మిల్లుకు సంబంధించిన బస్తాలలో పీడీఎస్ బియ్యాన్ని నింపి తిరిగి ప్రభుత్వానికి అమ్ముతూ లాభాలు పొందుతూ మోసం చేస్తున్నట్లు తేలింది. వీరికి మిల్లులో అకౌంటెంట్, క్యాషియర్‌లు పనిచేస్తున్న వెంపటి సంతోష్‌కుమార్, లింగంపల్లి సైదులు సహకరిస్తున్నట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు. 16వ తేదీన పీడీఎస్ బియ్యాన్ని లారీలో నింపుకుని ఎడ్ల ఆంజనేయులు అమ్మ రైస్ మిల్లు వద్దకు రాగా నల్లగొండ టాస్క్‌ఫోర్స్, పెద్దవూర పోలీసులు పీడీఎస్ బియ్యాన్ని అన్‌లోడ్ చేస్తుండగా పట్టుకున్నట్లు పేర్కొన్నారు. మరో లారీని హాలియా పోలీసులు పట్టుకున్నట్లు తెలిపారు. 749 బస్తాలతో పాటు విడి పీడీఎస్ బియ్యాన్ని, లారీని స్వాధీనం చేసుకుని సివిల్ సప్లై అధికారులకు అప్పగించినట్లు తెలిపారు. శనివారం లింగాల మల్లేష్, వెంపటి సంతోష్‌కుమార్, సైదులు, ఎండ్ల ఆంజనేయులును అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించామని, మిగిలిన వారు పరారీలో ఉన్నట్లు పేర్కొన్నారు. కేసు విచారణలో ఉన్నట్లు తెలిపారు.

వలిగొండలో 10 క్వింటాళ్లు..

వలిగొండ: టాటా ఏస్ వాహనంలో అక్రమంగా తరలిస్తున్న 10 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యాన్ని శనివారం పోలీసులు పట్టుకున్నారు. ఎస్‌ఐ మహేందర్ లాల్ తెలిపిన వివరాల ప్రకారం.. వలిగొండ మండలం రెడ్లరేపాక గ్రామ సమీపంలోని కోళ్ల ఫాంకు టాటా ఏస్ వాహనంలో పీడీఎస్ బియ్యం తరలిస్తున్నారన్న సమాచారం మేరకు పోలీసులు దాడి చేసి 10 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యంతో పాటు టాటా ఏస్ వాహనాన్ని సీజ్ చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. పీడీఎస్ బియ్యాన్ని అక్రమంగా తరలిస్తున్న వారిపై కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

విద్యుదాఘాతంతో మహిళ మృతి

సూర్యాపేటటౌన్: విద్యుదాఘాతంతో మహిళ మృతిచెందింది. ఈ ఘటన సూర్యాపేట జిల్లా కేంద్రంలోని రాజీవ్‌నగర్‌లో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. రాజీవ్‌నగర్‌కు చెందిన కోల నగేష్ భార్య శ్రీదేవి(40) శుక్రవారం రాత్రి వారి ఇంట్లో బోరు మోటారు స్విచ్ ఆన్ చేస్తుండగా ప్రమాదవశాత్తు విద్యుదాఘాతానికి గురై కిందపడిపోయింది. ఆ సమయంలో ఇంట్లో ఎవరూ లేరు. కొద్దిసేపటి తర్వాత తన భర్త వచ్చి చూసేసరికి ఆమె అపస్మారకస్థితిలో ఉంది. ఆమెను సూర్యాపేట ప్రభుత్వ జనరల్ ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతురాలి భర్త ఫిర్యాదు మేరకు శనివారం కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పట్టణ సీఐ రాజశేఖర్ తెలిపారు.

యూనిఫాం సిద్ధం చేయాలి

- యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ హనుమంతు కే.జెండగే



యాదగిరిగుట్ట: మల్లాపురంలో పర్యటిస్తున్న కలెక్టర్ జెండగే

యాదగిరిగుట్ట: పాఠశాలల విద్యార్థులకు జూన్ 12వ తేదీ వరకు యూనిఫాం సిద్ధం చేయాలని కలెక్టర్ హనుమంతు కే.జెండగే అధికారులకు సూచించారు. శనివారం యాదగిరిగుట్ట మండలం మల్లాపురంలో మండల పరిషత్, జిల్లా పరిషత్ పాఠశాలల్లో అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీల ద్వారా చేపట్టిన తాగునీటి ఏర్పాట్లు, టాయిలెట్స్, విద్యుద్దీకరణ, తరగతి గదుల మరమ్మతు పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జిల్లాలోని అన్ని పాఠశాలలు ప్రారంభమయ్యే నాటికి మౌలిక వసతులు కల్పించి విద్యార్థులను కొత్త విద్యా సంవత్సరంలోనికి ఆహ్వానించాలని చెప్పారు. అదేవిధంగా మల్లాపురంలో విద్యార్థులకు డ్రెస్సులు కుడుతున్న స్వయం సహాయక మహిళా సంఘం ద్వారా నడుపబడుతున్న మహాలక్ష్మి కుట్టు కేంద్రాన్ని ఆయన సందర్శించారు. జిల్లాలో 673 ప్రభుత్వ, ఎయిడెడ్, కస్తూర్బా, ప్రభుత్వ రెసిడెన్షియల్ పాఠశాలలకు 51,848 మంది విద్యార్థులకు స్టిచ్చింగ్ కోసం అన్ని మండల కేంద్రాలకు యూనిఫాం క్లాత్ పంపించడం జరిగిందన్నారు. 541 స్వయం సహాయక మహిళా సంఘాల ద్వారా యూనిఫామ్ డ్రెస్సులు కుట్టించి పాఠశాలలు ప్రారంభమయ్యే జూన్ 12వ తేదీ నాటికి విద్యార్థులకు అందించేటట్లు ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి ఏంఏ కృష్ణన్, జిల్లా విద్యాశాఖ అధికారి నారాయణ రెడ్డి, జిల్లా పరిషత్ హైస్కూల్ అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ అధ్యక్షురాలు వైష్ణవి, మండల పరిషత్ హైస్కూల్ అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ అధ్యక్షురాలు సంధ్య, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, మహిళా సమాఖ్య సభ్యులు పాల్గొన్నారు.

గ్రూప్–1 ప్రిలిమినరీ ఏర్పాట్లపై సమీక్ష..

భువనగిరిటౌన్: జూన్ 9వ తేదీన గ్రూప్–1 ప్రిలిమినరీ పరీక్ష నిర్వహణకు పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలని తెలంగాణ రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ చైర్మన్ ఎం. మహేందర్‌రెడ్డి ఆయాల జిల్లాల కలెక్టర్లు, పోలీసు ఉన్నతాధికారులకు సూచించారు. శనివారం ఆయన వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జిల్లా కలెక్టర్లు, పోలీస్ ఉన్నతాధికారులతో గ్రూప్–1 ప్రిలిమనరీ పరీక్ష ఏర్పాట్లను సమీక్షించారు. వీడియో కాన్ఫరెన్స్‌లో యాదాద్రి జిల్లా కలెక్టర్ హనుమంతు కే. జెండగే, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ కె. గంగాధర్, అధికారులు పాల్గొన్నారు.

ఏఎస్‌ఐ అంటూ ఫోన్ చేసి..

- రూ.75వేలు టోకరా పెట్టిన ఆగంతకుడు

నేరేడుచర్ల: ఏఎస్‌ఐ మాట్లాడుతున్నానంటూ పెట్రోల్ బంక్ యాజమానికి ఆగంతకుడు ఫోన్ చేసి రూ.75 వేలు టోకరా పెట్టాడు. ఈ ఘటన నేరేడుచర్లలో శుక్రవారం రాత్రి జరిగింది. వివరాలు.. నేరేడుచర్ల మండల కేంద్రంలోని హెచ్‌పీ పెట్రోల్ బంక్ యాజమాని రాచకొండ రాంకోటేశ్వర్‌రావుకు శుక్రవారం రాత్రి ఓ వ్యక్తి ఫోన్ చేసి తాను ఏఎస్‌ఐ అంటూ పరిచయం చేసుకున్నాడు. తమ ఎస్‌ఐ కుమార్తెకు యాక్సిడెంట్ అయ్యిందని, తన వద్ద రూ.75వేలు ఉన్నాయని, కానీ తనకు ఫోన్‌పే ద్వారా రూ.75వేలు పంపిస్తే.. తన వద్ద ఉన్న రూ.75వేలను నేరుగా పంపిస్తానని చెప్పాడు. కానీ బంక్ యాజమాని రాంకోటేశ్వర్‌రావు తన దగ్గర ఫోన్‌పే లేదని చెప్పడంతో.. తెలిసిన వారి వద్ద నుంచైనా ఫోన్ పే చేయించమని ఆగంతకుడు కోరాడు. దీంతో రాంకోటేశ్వర్‌రావు నేరేడుచర్లకు చెందిన తన మిత్రుడి నంబర్ ఆగంతకుడికి ఇచ్చాడు. ఆగంతకుడు రాంకోటేశ్వర్‌రావు మిత్రుడి నంబర్‌కు ఫోన్ చేసి విషయం చెప్పగా.. అతడి వద్ద కూడా అంత అమౌంట్ లేకపోవడంతో మరో వ్యక్తిని పిలిపించుకొని ఇరువురి కలిసి ఆగంతుకుడు చెప్పిన మరో నంబర్‌కు డబ్బులు ఫోన్ పే ద్వారా పంపించారు. ఎంతసేపైనా రూ.75వేలు తెచ్చి ఇవ్వకపోవడంతో తాము మోసపోయామని గ్రహించి 1930 నంబర్‌కు ఫోన్ చేసి ఫిర్యాదు చేశారు. ఈ విషయంపై నేరేడుచర్ల ఎస్‌ఐ రవీందర్‌నాయక్ మాట్లాడుతూ.. ఫేక్ ఫోన్‌కాల్స్ విషయంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కోరారు. మోసానికి గురైతే 1930 నంబర్‌కు ఫిర్యాదు చేయాలని సూచించారు.

టీఎస్ ఈఏపీసెట్–2024 ఫలితాల్లో 'జయ' ప్రభంజనం



ఉత్తమ ర్యాంకులు సాధించిన విద్యార్థులను అభినందిస్తున్న జయ కళాశాల యాజమాన్యం

సూర్యాపేట టౌన్: ఈఏపీసెట్–2024 ఫలితాల్లో సూర్యాపేట జిల్లా కేంద్రంలోని జయ జూనియర్ కళాశాలకు చెందిన మొదటి బ్యాచ్ విద్యార్థులు రాష్ట్ర స్థాయిలో అత్యుత్తమ ర్యాంకులు సాధించినట్లు కళాశాల కరస్పాండెంట్ జయ వేణుగోపాల్ తెలిపారు. శనివారం ప్రకటించిన ఫలితాల్లో కళాశాల విద్యార్థులు జి. వెంకటేష్ 370వ ర్యాంకు, జి. చందన 1275వ ర్యాంకు, కె. అభిజిత్ 1338వ ర్యాంకు, నాగసాయివరప్రసాద్ 1706, విష్ణుతేజ 1743, కె. సిద్ధార్థన్ 2473, ఎం. హర్షిణి 2885, టి. శ్రీలక్ష్మి 3153, జె. గౌతమ్‌కుమార్ 3258, ఎస్. దీక్షిత 4033, కె. సంతోష్ 4537, ఎస్. శ్రీలక్ష్మి, వైష్ణవి 4602, పి. సాయిశివాని 4658వ ర్యాంకులు సాధించినట్లు పేర్కొన్నారు. అంతేకాకుండా 13మంది విద్యార్థులు 5వేల లోపు, 29 మంది విద్యార్థులు 10వేల లోపు, 49మంది విద్యార్థులు 20వేల లోపు ర్యాంకులు సాధించినట్లు చెప్పారు. ర్యాంకులు సాధించిన విద్యార్థులను కరస్పాండెంట్‌తో పాటు డైరెక్టర్లు బింగి జ్యోతి, జెల్లా పద్మ అభినందించారు.

గౌతమి విద్యార్థుల విజయకేతనం



అఖిల్ వర్మ, 397వ ర్యాంకు

నల్లగొండ: పట్టణంలోని గౌతమి జూనియర్ కళాశాల విద్యార్థులు ఈఏపీసెట్–2024 ఫలితాల్లో విజయకేతనం ఎగురవేశారు. కళాశాలకు చెందిన అఖిల్ వర్మ 397వ ర్యాంకు, అక్షిత 1,450వ ర్యాంకు, మహ్మద్ ఉజైర్ 1,745, యాస్మిన్ 2,736, ఫైజా ఆఫ్రిన్ 3,020, అబిముల పూజిత 3,030, టి. గ్రీష్మ 3,159, ఆఫియా సదాఫ్ 3,847, ఎల్. లహరి 5,446, అనికేత్ 5,967, కె. భావన 5,921, సౌమ్య 6,372, సాయి నిఖిల 6,611, నూతన్‌రెడ్డి 7,616, పూజిత 7,682, ఎస్. మోహన దీప 7699, శ్రీవల్లి 7,856, హుడా జరీన్ దేశ్‌ముఖ్ 8,171, అమతుర్ రెహమాన్ 8,834, కె. అనూష 8664, గాయత్రి 8,870, సరస్వతి 10,157, లక్ష్మీ సుధ 10,501, టి. సౌమ్య 11,148, టి. ప్రీతి 11,390, పవన్‌కుమార్ 12,180, లక్ష్మీప్రసన్న 12,372, ఎం. భావన 12377, పి. వర్షిణి 12,578, సాయి కీర్తన 13,055, షేక్ సోని 13,869వ ర్యాంకులు సాధించారు. ఉత్తమ ర్యాంకులు సాధించిన విద్యార్థులను కళాశాల యాజమాన్యం కాసర్ల వెంకట్‌రెడ్డి, చల్లా వెంకటరమణ, కొమ్మిడి రఘుపాల్‌రెడ్డి, పుట్టా వెంకటరమణారెడ్డి, అధ్యాపక బృందం అభినందించారు.

ఉత్తమ ర్యాంకులు సాధించిన ప్రగతి విద్యార్థులు



ఆర్. శ్రీనందన, 747వ ర్యాంకు



ఎం. మనోజ్, 867వ ర్యాంకు

నల్లగొండ: ఈఏపీసెట్–2024 ఫలితాల్లో నల్లగొండ పట్టణంలోని ప్రగతి జూనియర్ కళాశాల విద్యార్థులు రాష్ట్రస్థాయిలో ఉత్తమ ర్యాంకులు సాధించారు. కళాశాలకు చెందిన ఆర్. శ్రీనందన 747వ ర్యాంకు, ఎం.మనోజ్ 867, ఎస్. రూపాంజలి 1,545, ఆర్. చందన దుర్గ 1,552, టి. మనీష్ 2,189, ఎస్. అనురాధ 2,329, ముక్షిత్ 2,568, ఎన్. హరిచక్రవర్తి 2,660, ఎం. సంతోష్ 4,978, కె. జశ్వంత్‌కుమార్ 4,979, జె. నిఖిల 5,092, బి. రమ్యశ్రీ 5,510, కె. ఇందు 5,651, జె. యశ్వంత్ 6,093, జి. దీక్షిత్ 6,157, డి. సాయిప్రసాద్ 6,499, ఎ. వంశీధర్‌రెడ్డి 6,697, ఎ. వైష్ణవి 6,885, డి. రాముడు 7,107, కె. సంజన 7,693, పి. తేజిత్‌రెడ్డి 7,719, యశ్వంత్ సాయి హరిహర రామసహాయం 7,952, కె. నవ్యత 8,347, ఎం. అశ్రిత 8,351, పి. శ్రవణ్ 8,463, పి. సాయివివేక్ 9,248, డి. హనుమంతు 9,330, డి. రేవతి 9,419, బి. యశ్వంత్‌రెడ్డి 9,784, జి. ఆర్యనందన్ 10,407 ర్యాంకులు సాధించారు. అంతేకాకుండా 81మంది విద్యార్థులు 25వేల లోపు ర్యాంకులు సాధించారు. ర్యాంకులు సాధించిన విద్యార్థులను కళాశాల చైర్మన్ చందా కృష్ణమూర్తి, డైరెక్టర్లు ఎ. నరేందర్‌బాబు, ఎస్. శిధర్‌రావు, చందా శ్రీనివాస్, పైళ్ల రమేష్‌రెడ్డి అభినందించారు.

వెల్లంకి విద్యార్థినికి 142వ ర్యాంకు



కూరెళ్ల వెన్నెల

రామన్నపేట: మండలంలోని వెల్లంకి గ్రామానికి చెందిన స్వర్ణకారుడు కూరెళ్ల భిక్షమాచారి–కవిత దంపతుల కుమార్తె కూరెళ్ల వెన్నెల శనివారం ప్రకటించిన టీఎస్ ఈఏపీసెట్–2024 ఫలితాల్లో అగ్రికల్చర్ అండ్ ఫార్మసీ విభాగంలో రాష్ట్రస్థాయిలో 142వ ర్యాంకును సాధించింది. వెన్నెల చౌటుప్పల్‌లోని బాలికల గురుకుల పాఠశాలలో పదో తరగతి చదివి 9.8 జీపీఏ సాధించింది. హైదరాబాద్‌లోని శ్రీచైతన్య జూనియర్ కళాశాలలో ఇంటర్ పూర్తి చేసింది. ఇంటర్‌లో బైపీసీలో 984మార్కులు సాధించింది. వెన్నెలను పద్మశ్రీ డాక్టర్ కూరెళ్ల విఠలాచార్య, స్థానిక ప్రజాప్రతినిధులు గ్రామస్తులు అభినందించారు.

ఇందుగుల వాసికి 574వ ర్యాంకు



జాహ్నవిరెడ్డి

మాడుగులపల్లి: మండల పరిధిలోని ఇందుగుల గ్రామ పంచాయతీకి చెందిన కల్లు జాహ్నవిరెడ్డి టీఎస్ ఈఏపీసెట్ ఫలితాల్లో ఇంజనీరింగ్ విభాగంలో 574వ ర్యాంకు సాధించింది. జాహ్నవిరెడ్డి ప్రాథమిక విద్యను మిర్యాలగూడలోని ఓ ప్రైవేట్ పాఠశాలలో పూర్తి చేసింది. పదో తరగతిలో 10 జీపీఏ సాధించింది. ఇంటర్మీడియట్ హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ కళాశాలలో చదివింది. ఇటీవల విడుదలైన ఆల్‌ఇండియా జేఈఈ మెయిన్స్‌లోనూ ఆమె 1273వ ర్యాంకు సాధించింది. జాహ్నవిరెడ్డి తల్లి ధనలక్ష్మి గురుకుల ఉపాధ్యాయురాలిగా పనిచేస్తుండగా.. తండ్రి శ్రీనివాస్‌రెడ్డి వ్యవసాయం చేస్తున్నారు. ప్రస్తుతం జేఈఈ అడ్వాన్స్‌డ్‌కు సన్నద్ధమవుతున్నట్లు పేర్కొంది. ఐఐటీలో సీటు సాధించడమే తన లక్ష్యమని వెల్లడించింది.

రేపటి నుంచి శ్రీనృసింహ జయంతి ఉత్సవాలు

- మూడు రోజుల పాటు వివిధ అలంకార సేవలు
- ఉత్సవాల నేపథ్యంలో ఆర్జిత సేవలు రద్దు



యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయం

యాదగిరిగుట్ట: యాదాద్రి లక్ష్మీనరసింహస్వామి జయంత్యుత్సవాలు ఈనెల 20వ తేదీ నుంచి ప్రారంభం కానున్నాయి. మూడు రోజుల పాటు జరిగే ఈ ఉత్సవాలు 22వ తేదీ రాత్రి స్తంభోద్భవ ఘట్టంతో ముగుస్తాయి. జయంత్యుత్సవాల్లో లక్ష కుంకుమార్చన, లక్ష పుష్పార్చనలతో పాటు హవన, నిత్య మూలమంత్ర పూజలను నిర్వహించేందుకు అర్చకులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఉత్సవ నిర్వహణలో పూజలతో పాటు ఆధ్యాత్మిక ఆహ్లాదాన్ని కలిగించేందుకు మూడు రోజుల పాటు ధార్మిక, సాహిత్య, సంగీత మహాసభలు నిర్వహించనున్నారు.

మూడు రోజులు సేవలు ఇవే..

జయంత్యుత్సవాల సందర్భంగా ఆలయంలో ఉదయం, రాత్రి వైభవంగా అలంకార సేవలు నిర్వహించనున్నారు. 20వ తేదీ ఉదయం తిరువేంకటపతి అలంకారసేవ, రాత్రి పరవాసుదేవ అలంకార సేవ, 21న ఉదయం కాళీయ మర్దనం అలంకార సేవ, రాత్రి హనుమంత వాహనంపై రామావతార అలంకార సేవ, 22వ తేదీ శ్రీస్వామి జయంతి రోజు రాత్రి నృసింహ అవతార అలంకార సేవ చేపడుతారు.

ఆర్జిత సేవలు రద్దు

శ్రీస్వామి జయంతి ఉత్సవాల సందర్భంగా మూడు రోజులు ఆలయంలో ఆర్జిత సేవలు రద్దు చేశారు. శాశ్వత కల్యాణాలు, శాశ్వత బ్రహ్మోత్సవాలు, శ్రీసుదర్శన నారసింహ హోమం నిలిపివేయనున్నారు. పాతగుట్ట ఆలయంలో సైతం మూడు రోజుల పాటు జరిగే జయంతి ఉత్సవాల్లో భాగంగా ఆర్జిత సేవలను నిలివేయనున్నారు.

ఉత్సవాలను వైభవంగా నిర్వహిస్తాం

శ్రీనృసింహ జయంతి ఉత్సవాలను వైభవంగా నిర్వహిస్తామని ఆలయ ఈవో భాస్కర్‌రావు చెప్పారు. సోమవారం ఉదయం 8.30గంటలకు స్వస్తి వాచనం, విష్వక్సేన పూజ, పుణ్యాహవాచనం, రుత్విక్ వరణం, సాయంత్రం 6గంటలకు మృత్సంగ్రహణం, అంకురార్పణ, హవనం జరుగుతుందని వివరించారు. 21వ తేదీన నిత్య మూలమంత్ర హవనం, లక్ష పుష్పార్చన, సాయంత్రం నృసింహ మూలమంత్ర హవనం, నిత్య పూర్ణాహుతి, 22న నృసింహ మూలమంత్ర హవనం, మహాపూర్ణాహుతి, సహస్ర కలశాభిషేకం, సాయంత్రం నృసింహ ఆవిర్భావం, మహానివేధన, తీర్థ ప్రసాద గోష్ఠితో ఉత్సవాలు ముగుస్తాయని చెప్పారు.